సాక్షి జగిత్యాల
మంగళవారం । 10 । జనవరి । 2023



రాజన్నకు మొక్కులు

వేములవాడ: రాజన్నను సోమవారం 20 వేల మంది భక్తులు దర్శించుకున్నారు. తొలుత ధర్మగుండంలో స్నానాలు చేశారు.



కల్యాణం.. కమనీయం

కోరుట్లటౌన్: వెంకటాపూర్ శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయంలో శ్రీగోదారంగనాయకుల స్వామి కల్యాణం వైభవంగా జరిగింది.

వాతావరణం

గరిష్టం/కనిష్టం
28.0/11.0

ఆకాశం నిర్మలంగా ఉంటుంది. గాలిలో తేమశాతం అధికంగా ఉంటుంది. ఈదురుగాలులు తీవ్ర వేగంగా వీస్తాయి.

న్యూస్‌రీల్

మెడికల్ రీయింబర్స్‌మెంట్ చెల్లించాలని వినతి



ప్రభుత్వ ప్రధాన కార్యదర్శితో నాయకులు

జగిత్యాల: తమకు వెంటనే వైద్య ఖర్చుల బిల్లులు విడుదల చేసేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ పెన్షనర్స్ అసోసియేషన్ నాయకులు సోమవారం హైదరాబాద్‌లో సీఎస్ సోమేశ్ కుమార్‌ను కలిసి ఒక వినతిపత్రం అందజేశారు. పెన్షనర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు గాజుల నర్సయ్య ఆధ్వర్యంలో వీరు సీఎస్‌ను కలిశారు. గ్రంథాలయ సంస్థ ఉద్యోగులు, పెన్షనర్లకు 010 జీవో కింద ట్రెజరీ ద్వారా వేతనాలు, పెన్షన్ చెల్లించేలా చూడాలన్నారు. ప్రతి నెలా ఒకటో తేదీనే పెన్షన్ చెల్లించేలా ఆదేశాలు ఇవ్వాలని విన్నవించారు. స్పందించిన సోమేశ్‌కుమార్.. సమస్యను వెంటనే పరిష్కరిస్తానని హామీ ఇచ్చినట్లు వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పెన్షనర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు హరి అశోక్‌కుమార్ పాల్గొన్నారు.

న్యాయవాదుల ఆందోళన



నిరసన తెలుపుతున్న న్యాయవాదులు

మెట్‌పల్లి(కోరుట్ల): పట్టణంలోని కోర్టు ఎదుట సోమవారం న్యాయవాదులు విధులు బహిష్కరించి ఆందోళన నిర్వహించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పుప్పాల లింబాద్రి మాట్లాడుతూ నిజామాబాద్‌కు చెందిన న్యాయవాది గణపతితోపాటు కోర్టు సిబ్బందిపై కలెక్టర్ తప్పుడు కేసులు నమోదు చేయించడం సరికాదన్నారు. వీటిని వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. లేకుంటే పెద్ద ఎత్తున ఆందోళనలు చేస్తామని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో న్యాయవాదులు తెడ్డు ఆనంద్, ఏలేటి నరేందర్‌రెడ్డి, అబ్దుల్ హఫీజ్, వలీయుద్దీన్, ఓగులపు శేఖర్, వెంకటస్వామి, రాంరెడ్డి, నయూం పాల్గొన్నారు.

విద్యార్థిని ప్రతిభ



చందనను అభినందిస్తున్న ఉపన్యాసకులు

మెట్‌పల్లి(కోరుట్ల): పర్యావరణ పరిరక్షణ పరిశోధన సంస్థ ఆధ్వర్యంలో ఇటీవల 'ఓజోన్ పరిరక్షణ' అంశంపై నిర్వహించిన ఉపన్యాస పోటీల్లో స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన ప్రభురాజ్ చందన రాష్ట్రస్థాయిలో తృతీయ స్థానంలో నిలిచింది. ఈ మేరకు సోమవారం కళాశాలలో ఆమెకు ప్రశంసాపత్రంతోపాటు మెడల్ అందజేసి అభినందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ బూర్ల చంద్రశేఖర్, ఉపన్యాసకులు బిల్ల రాజేందర్, మనోజ్‌కుమార్, గట్టయ్య, అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

మొరాయించిన వాహనం



వాహనాన్ని నెట్టుతున్న సిబ్బంది

జగిత్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని తహసీల్ చౌరస్తా వద్ద సోమవారం ఎక్సైజ్ శాఖ వాహనం ముందుకు కదలకుండా మొరాయించింది. దీంతో ఎక్సైజ్ కానిస్టేబుళ్లు ఆ వాహనాన్ని ముందుకు తోశారు. చివరకు వాహనం స్టార్ట్ కావడంతో అధికారులు, కానిస్టేబుళ్లు కలిసి వాహనంలో గమ్యస్థానం చేరుకున్నారు.

రుణాలతో ఆర్థిక ప్రగతి



మాట్లాడుతున్న మేనేజర్ కాశీరాం

జగిత్యాలరూరల్: మహిళా సంఘాలు రుణాలతో ఆర్థిక ప్రగతి సాధించాలని ఎస్‌బీఐ ఏడీబీ చీఫ్ మేనేజర్ కాశీరాం సూచించారు. సెర్ప్ కార్యాలయంలో వీవోఏలు, సీబీఆర్‌ఎంలతో సోమవారం ఆయన ఆర్థిక ప్రగతిపై సమీక్షించారు. బ్యాంకులు మంజూరు చేస్తున్న రుణాలతో మహిళలు వ్యాపారాలు చేసుకోవాలని, పరిశ్రమలు స్థాపించుకోవాలని సూచించారు. అర్హతను బట్టి ఒక్కో సంఘానికి రూ.లక్ష నుంచి రూ.20 లక్షల వరకు తక్కువ వడ్డీకే రుణాలు మంజూరు చేస్తున్నారని తెలిపారు. స్త్రీనిధి ఆర్‌ఎం ఆనందరావు, సెర్ప్ డీపీఎం వెంకటేశం, ఏపీఎం గంగాధర్, సీసీలు పాల్గొన్నారు.

నిరసన ప్రణాళిక

- కొత్త మాస్టర్‌ప్లాన్‌పై ఆగ్రహ జ్వాలలు
- ఆందోళనకు దిగుతున్న అన్నదాతలు
- వ్యవసాయ భూముల సేకరణపై వ్యవసాయదారుల మండిపాటు
- సర్వం కోల్పోతే ఆదుకునే వారు ఎవరంటున్న రైతులు



తిమ్మాపూర్ గ్రామపంచాయతీ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న రైతులు

జగిత్యాల: జగిత్యాల బల్దియాలో కొత్త మాస్టర్ ప్లాన్ అమలుపై నిరసనలు వెల్లువెత్తుతున్నాయి. ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇవ్వడంతో అధికారులు దీనిపై ఇప్పటికే నోటిఫికేషన్ విడుదల చేశారు. ఇందులో రహదారుల విస్తరణ, ట్రాఫిక్ క్రమబద్ధీకరణ, వాహనాల పార్కింగ్, ఇండస్ట్రియల్ కారిడార్, జోన్ల గుర్తింపు వంటి అంశాలు చేర్చారు. కానీ, కొత్తమాస్టర్ ప్లాన్ ద్వారా కలిగే ప్రయోజనాల గురించి ప్రజలకు అవగాహన కల్పించడంలో విఫలమయ్యారు. ఫలితంగా ఇది అమలులోకి వస్తే భవిష్యత్‌లో తమకు ఎలాంటి ముప్పు వాటిల్లుతుందోననే భయంతో మున్సిపల్‌వాసులే కాదు.. సమీప గ్రామాల రైతులు, ప్రజలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

భూములు కోల్పోతామని రైతులు..

- కొత్త మాస్టర్ ప్లాన్ ద్వారా తాము భూములు కోల్పోతామని, ఇండస్ట్రియల్ కారిడార్, వైద్యం, ఆరోగ్యం, విద్య ప్రాంతాలుగా మారితే తమ పరిస్థితి ఏమిటని రైతులు భయపడుతున్నారు.
- ఇప్పటికే జోన్ల గుర్తింపు చేపట్టకపోవడంతో ఇంటి నిర్మాణానికి అనుమతులు లభించలేదు.
- ఇప్పుడు కొత్త మాస్టర్‌ప్లాన్ ముసాయిదా విడుదల చేసినా.. దాదాపు అదే అమలులోకి వస్తుందని, తద్వారా తాము ఊహించినట్లే నష్టపోతామని ఆందోళన చెందుతున్నారు.
- సుమారు లక్షకుపైగా జనాభా ఉన్న బల్దియాలో ఎవరితోనూ సమీక్షించకుండానే ముసాయిదా మాస్టర్‌ప్లాన్ రూపొందించారని రైతులు ఆరోపించారు.
- ఇదేవిషయంపై పట్టణంలోని ప్రధాన ప్రాంతాల్లో ఫ్లెక్సీలు కూడా కట్టారు.

నాలుగేళ్లు కసరత్తు చేసినా..

సుమారు నాలుగేళ్లపాటు కసరత్తు చేసిన అధికార యంత్రాంగం కొత్త మాస్టర్ ప్లాన్ రూపొందించింది. వివిధ గ్రామాలకు చెందిన సుమారు 350 ఎకరాల వ్యవసాయ భూములు ఇందులోకి వస్తాయని గుర్తించింది. అయితే, గ్రీన్, ఇండస్ట్రియల్ జోన్లపై రైతులు ఆందోళన చెందుతున్నారు. పంట భూములను ఇండస్ట్రియల్, గ్రీన్, రిక్రియేషన్ జోన్లుగా గుర్తించడం, భూముల్లోంచే రోడ్లు నిర్మించాలని నిర్ణయించడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రెండు పంటలు సాఫీగా పండించుకునే తమ భూములను లాక్కునే ప్రయత్నం చేస్తున్నారని అధికారులపై ఆరోపణలు గుప్పిస్తున్నారు.

సాగు ప్రశ్నార్థకం..

జగిత్యాల శివారులోని హస్నాబాద్, తిప్పన్నపేట, లింగంపేట, మోతె తదితర ప్రాంతాలను ఇండస్ట్రియల్ ఏరియా, గ్రీన్‌జోన్‌గా మాస్టర్‌ప్లాన్‌లో చూపించారు. చెరువులు ఉన్న ప్రాంతాలను బఫర్ జోన్లుగా గుర్తించారు. దీంతో ఆయా ప్రాంతాల్లో భూముల క్రయవిక్రయాలు నిలిచిపోతాయని, పంటలు పండించాలన్నా సమస్యలు ఎదర్కోవాల్సి వస్తుందని అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. గ్రామాల్లోని కొన్నిచోట్ల 100 అడుగులు, మరికొన్నిచోట్ల 60 అడగులు, ఇంకొన్నిచోట్ల ఇంకా తక్కువ వెడల్పుతో రోడ్లు నిర్మించాలని నిర్ణయించడం సరికాదని అంటున్నారు. ప్రధానంగా హస్నాబాద్, అంబారిపేట, తిప్పన్నపేట, మోతె, లింగంపేట తదితర గ్రామాల రైతులకు కొత్త మాస్టర్ ప్లాన్ అనేక ఇబ్బందులు తెచ్చిపెడుతుందని నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వివిధ పంటలు పండిస్తూ బతుకుతున్న రైతులు.. ఇండస్ట్రియల్ ఏరియా, ఎడ్యుకేషన్ ఏరియా, బఫర్‌జోన్లు గుదిబండలా తయారు చేస్తాయని వాపోతున్నారు.

అన్నదాతల ఆందోళన



కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్న అన్నదాతలు

జగిత్యాలరూరల్: మున్సిపల్ శివారు గ్రామాలను కలుపుకుని కొత్త మాస్టర్ ప్లాన్ రూపొందించడంపై ఆయా గ్రామాల రైతులు, ప్రజలు సోమవారం ఆందోళనకు దిగారు. ప్రధానంగా వ్యవసాయ భూములను ఇండస్ట్రియల్, రెసిడెన్షియల్, కమర్శియల్, మిక్స్‌డ్ జోన్‌లలో చేర్చడంతో ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. హస్నాబాద్ శివారు తిప్పన్నపేటలోని భూములను పారిశ్రామిక జోన్‌లో కలిపారు. దీంతో హస్నాబాద్, ధరూర్, నర్సింగాపూర్, వెల్దుర్తి, మోతె, తిమ్మాపూర్, తిప్పన్నపేట గ్రామస్తులు సోమవారం గ్రామపంచాయతీ కార్యాలయాల ఎదుట ఆందోళనలు చేపట్టారు. మాస్టర్ ప్లాన్ నుంచి తమ భూములను తొలగించాలని డిమాండ్ చేశారు. ఈమేరకు కలెక్టర్ రవికి వినతిపత్రాలు అందజేశారు.

పడిపోయిన రియల్ భూమ్

- ముసాయిదా మాస్టర్‌ప్లాన్ విడుదలై మూడు రోజులు కూడా కాలేదు. అప్పుడే భూముల క్రయవిక్రయాలు స్తంభించాయి. ధరలు కూడా తగ్గాయని రియలర్లు చెబుతున్నారు.
- ఈ ప్రాంతాల్లో భూములు కొనుగోలు చేస్తే భవిష్యత్‌లో అనుమతులు రాక ఇబ్బందులు ఎదువుతాయనే ఉద్దేశంతో చాలామంది క్రయవిక్రయాలకు ముందుకు రావడంలేదని అంటున్నారు.
- జిల్లా కేంద్రంగా మారడం, సమీప గ్రామాలు విలీనం కావడంతో తొలుత ఒక్కో గుంట దాదాపు రూ.20లక్షల – రూ.30 లక్షల వరకు ధర పలికింది.
- ప్రస్తుత ముసాయిదా మాస్టర్‌ప్లాన్‌తో ధరలు అమాంతం పడిపోయాయని చెబుతున్నారు.
- ఆగ్రమించిన అన్నదాతలు ఆర్డీవో, తహసీల్దార్ కార్యాలయాల ఎదుట నిరసన తెలుపుతున్నారు.
- సోమవారం ఏకంగా కలెక్టరేట్‌కు చేరుకుని ప్రజావాణిలో కలెక్టర్ ఎదుట నిరసన తెలిపారు.
- మరోవైపు.. ఫిబ్రవరి 28వ తేదీ వరకు ముసాయిదా మాస్టర్‌ప్లాన్‌పై అభ్యంతరాలు, ఫిర్యాదులు, సలహాలు, సూచనలు స్వీకరిస్తామని, వీటిని తప్పకుండా పరిశీలనలోకి తీసుకుంటామని అధికారులు భరోసా ఇస్తున్నారు.

గ్రామీణ క్రీడాప్రాంగణాలు సకాలంలో పూర్తిచేయండి

- కలెక్టర్ రవి



మాట్లాడుతున్న కలెక్టర్ రవి

జగిత్యాల: గ్రామీణ ప్రాంతాల్లో చేపట్టిన క్రీడా ప్రాంగణాల పనులు త్వరితగతిన పూర్తిచేయాలని కలెక్టర్ రవి ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ నుంచి అధికారులతో కాన్ఫరెన్స్ ద్వారా ఆయన మాట్లాడారు. వైకుంఠధామాలు, వన నర్సరీలు, ఇంటిగ్రేటెడ్ మార్కెట్ పనులను వేగంగా చేపట్టాలని చెప్పారు. మన ఊరు.. మనబడి పథకం కింద ప్రభుత్వ పాఠశాలల్లో చేపట్టిన పనులను నిర్దేశిత లక్ష్యంలోగా పూర్తి చేయాలని అన్నారు. ఈ ఆఫీసును పకడ్బందీగా అమలు చేయాలని పేర్కొన్నారు. ప్రభుత్వం త్వరలో చేపట్టే కంటి వెలుగు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్లు మకరంద్, లత పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

ప్రజావాణి ద్వారా అర్జీల రూపంలో అందుతున్న సమస్యలను పరిష్కరించాలని కలెక్టర్ రవి సూచించారు. సోమవారం కలెక్టరేట్‌లో ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులకు సత్వరమే న్యాయం జరగాలన్నారు. పెండింగ్‌లో ఉన్న అర్జీలపై అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు ప్రత్యేక దృష్టి సారించి సాధ్యమైనంత త్వరగా పరిష్కరించాలని చెప్పారు. రెవెన్యూ, భూ సమస్యలు క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించాలని అన్నారు. ప్రజావాణికి మొత్తం 16 ఫిర్యాదులు వచ్చాయని, ప్రతీఒక్కటి పరిష్కరించాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్లు లత, మకరంద్ పాల్గొన్నారు.

డబుల్‌బెడ్రూమ్ ఇళ్లు ఇప్పించండి

జగిత్యాల: అర్హులందరికీ డబుల్‌బెడ్‌రూం ఇళ్లు మంజూరు చేయాలని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి కోరారు. ఈమేరకు సోమవారం ఆయన కలెక్టర్ రవికి ఒక లేఖ రాశారు. పెరుగుతున్న జనాభాను పరిగణలోకి తీసుకుని ఇళ్లులేని పేదలకు డబుల్ బెడ్రూమ్ ఇళ్లు ఇప్పించాలని ఆయన పేర్కొన్నారు.

పథకాల అమలులో ఆదర్శం

- రాష్ట్రమంత్రి కొప్పుల ఈశ్వర్



పాఠశాల భవనం ప్రారంభిస్తున్న మంత్రి ఈశ్వర్

పెగడపల్లి(ధర్మపురి): తెలంగాణ రాష్ట్రం అమలు చేస్తున్న ప్రజాసంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులు దేశానికి దిక్సూచిగా నిలిచాయని రాష్ట్రమంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు. ఆసరా పింఛన్లు, షాదీముబారక్, కల్యాణలక్ష్మీ, కేసీఆర్ కిట్లు, గర్భిణులకు న్యూట్రిషన్ కిట్లు, రైతుబంధు, రైతుబీమా, ఉచిత కరెంట్, మన ఊరు–మన బడి కింద పాఠశాలల అభివృద్ధి, విద్య, వైద్యం తదితర కార్యక్రమాలు దేశంలో ఎక్కడా లేవన్నారు. ఇవన్నీ అమలు చేస్తున్న సీఎం కేసీఆర్‌కు ప్రజలు అండగా ఉండాలని కోరారు. లింగాపూర్‌లో రూ.1.80 కోట్ల వ్యయంతో చేపట్టిన విద్యుత్ సబ్‌స్టేషన్, రూ.15 లక్షల వ్యయంతో నిర్మించిన శ్మశానవాటిక, పెగడపల్లిలో రూ.75 లక్షల వ్యయంతో నిర్మించిన పాఠశాల భవనం, రూ. 25 లక్షల వ్యయంతో నిర్మించిన శాఖ గ్రంథాలయ భవనం, రూ. 12 లక్షల వ్యయంతో నిర్మించిన మాల సంఘం భవనాలను జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ చంద్రశేఖర్ గౌడ్‌తో కలిసి ఆయన సోమవారం ప్రారంభించారు. అనంతరం పెగడపల్లి– మల్యాల వరకు రూ.2 కోట్ల వ్యయంతో చేపట్టిన రెండు వరుసల రహదారి, శివాలయంలో రూ.50 లక్షల వ్యయంతో చేపట్టిన గాలిగోపురం పనులకు శంకుస్థాపనచేశారు. మండల పరిషత్ కార్యాలయంలో 32 మందికి కల్యాణలక్ష్మీ, షాదీముబారక్, సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. గ్రామీణుల అవసరాల మేరకు వసతులు కల్పిస్తున్నామన్నారు. అభివృద్ధి, సంక్షేమాన్ని చూసి ఓర్వలేని ప్రతిపక్షాలు తప్పుడు ప్రచారం చేస్తున్నాయని విమర్శించారు. అనంతరం కుల సంఘాలతో వేర్వేరుగా సమావేశమయ్యారు. అంతకుముందు లింగాపూర్‌లో బతుకమ్మ, బోనాలతో మంత్రికి స్వాగతం పలికారు. జెడ్పీటీసీ రాజేందర్‌రావు, ఎంపీపీ శోభ, సర్పంచులు శ్రీనివాస్, శంకర్, సింగిల్‌విండో చైర్మన్లు రమణారావు, వేణుగోపాల్, భాస్కర్‌రెడ్డి, ఎంపీటీసీ జమున, శోభ, వైస్ ఎంపీపీ గంగాధర్ ఉన్నారు.

గురుకులాల్లో ప్రవేశాలు



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ మహేందర్

జగిత్యాల: జిల్లాలోని గురుకులాల్లో ప్రవేశాలు పొందాలని మైనార్టీ రెసిడెన్షియల్ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ మహేందర్ సూచించారు. జిల్లా కేంద్రంలోని బాలుర జూనియర్ కళాశాలలో 2023–24 సంవత్సరానికి ఇంటర్ మొదటి సంవత్సరం ఎంపీసీ, బైపీసీ ఇంగ్లిష్ మీడియంలో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈనెల 15 నుంచి www.tmreis.telangana.gov.in ద్వారా లేదా నేరుగా కళాశాలలో సంప్రదించి దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఎంపీసీ, బైపీసీలో మైనార్టీలకు 60, బీసీలకు 10, ఎస్టీలకు 4, ఓసీలకు 2 సీట్లు కేటాయించారని ఆయన చెప్పారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఇందులో ఇంటర్‌తోపాటు ఎంసెట్, నీట్‌లో శిక్షణ ఇస్తారని ఆయన వివరించారు.

మెప్మా ఆర్పీ అరెస్ట్

- మహిళా సంఘాల సొమ్ము కాజేసిన కేసులో నిందితురాలు
- రూ.7 లక్షల నగదు, 2 మొబైల్ ఫోన్లు, కారు స్వాధీనం



వివరాలు వెల్లడిస్తున్న సీఐ రాజశేఖరరాజు

కోరుట్లరూరల్: మున్సిపాలిటీలోని పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ(మెప్మా)లో రిసోర్స్ పర్సన్(ఆ ర్పీ)గా విధులు నిర్వర్తిస్తున్న కొమ్ముం స్వర్ణలతను అరెస్టు చేసినట్లు కోరుట్ల సీఐ రాజశేఖరరాజు తెలిపారు. గతనెల 27న మహిళా సంఘానికి చెందిన సుమారు రూ.10లక్షలు బ్యాంకు నుంచి డ్రా చేసి ఆమె కనిపించకుండా పోయిందన్నారు. స్వర్ణలతతోపాటు ఆమెకు సహకరించిన మరోవ్యక్తిని అదుపులోకి తీసుకున్నట్లు వివరించారు. స్థానిక ఠాణాలో సోమవారం సీఐ ఈ వివరాలు వెల్లడించారు. పట్టణంలోని బెండపెల్లికి చెందిన మదీనా మహిళా సంఘాం పేరిట హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు ద్వారా గతనెల 27న రూ.10 లక్షల రుణం మంజూరైంది. ఈ సొమ్మును మహిళా సంఘం సభ్యులకు ఇవ్వకుండా తానే పట్టుకుని కనిపించకుండా పారిపోయింది. ఈ విషయంపై మహిళా సంఘం నాయకురాలు జకియా బేగం పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకున్న సీఐ రాజశేఖరరాజు.. ఎస్‌ఐ సతీశ్, సిబ్బంది రంగంలోకి దిగారు. ఈక్రమంలో కోరుట్ల శివారులో ఆదివారం కొమ్ముం స్వర్ణలతతోపాటు మరోవ్యక్తి అనూప కృష్ణను ఆదివారం అదుపులోకి తీసుకున్నారు. వారినుంచి రూ.7లక్షల నగదు, 2 మొబైల్ ఫోన్లు, కారు స్వాధీనం చేసుకున్నారు. స్వర్ణలత, కృష్ణ.. మహిళా సంఘాల సభ్యులను తప్పుదోవ పట్టించి మెట్‌పల్లిలోని ఓ బ్యాంకు నుంచి రూ. 72లక్షలు, కోరుట్ల హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకులో సుమా రు రూ.9.5 లక్షలు రుణాలు తీసుకున్నారు. ఈ సొమ్మును సభ్యులకు ఇవ్వకుండా దుర్వినియోగం చేశారు. ఈమేరకు స్వర్ణలత, కృష్ణను అరెస్టు చేసి కోరుట్ల కోర్టులో హాజరుపర్చారు. దీంతో కోర్టు వారికి రిమాండ్ విధించింది. ఈమేరకు నిందితులను కరీంనగర్ జైలుకు తరలించారు. రుణాల దుర్వినియోగంలో మరికొంతమంది హస్తం ఉందని, ఈమేరకు మరింత లోతుగా విచారణ చేస్తున్నామని సీఐ వివరించారు. ఈ కార్యక్రమంలో కోరుట్ల, మేడిపల్లి, కథలాపూర్ ఎస్సైలు, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పుష్కలంగా నీళ్లు.. పొలాలు బీళ్లు

- పక్కనే వరద కాలువ.. అయినా పంటలకు అందని నీరు
- ప్రతిపాదనలకే పరిమితమైన పంపుహౌస్‌ల నిర్మాణం
- ఆయకట్టేతర మండలాల రైతులకు తప్పని ఇబ్బందులు



జిల్లాలో ప్రవహిస్తున్న వరదకాలువ

జగిత్యాలఅగ్రికల్చర్: వ్యవసాయాధారిత జిల్లా జగిత్యాలకు శ్రీరాంసాగర్ ప్రాజెక్టు ఓ వరం. ఓ వైపు కాకతీయ కాలువ, మరోవైపు వరదకాలువ జిల్లాలో పచ్చదనం పర్చుతున్నాయి. అయితే, కాకతీయ కాలువ ద్వారా మెజారిటీ మండలాలకు సాగునీరు అందుతున్నా.. వరద కాలువ ద్వారా జిల్లాలోని ఏఒక్క గ్రామానికి కూడా చుక్కనీరు అందడంలేదు. శ్రీరాంసాగర్ పునర్జీవ పథకం కింద వరద కాలువ నిత్యం నీటితో కళకళలాడుతూ ఉంటుంది. కానీ, ఆయకట్టుకు సాగునీరు అందని దైన్యం నెలకొంది.

ఆయకట్టేతర రైతుల బాధలు వర్ణనాతీతం..

- జిల్లాలోని మేడిపల్లి, భీమారం, కథలాపూర్, మల్యాల, కొడిమ్యాల మండలాలు, కోరుట్ల, మెట్‌పల్లి, జగిత్యాల రూరల్ మండలాల్లోని కొన్ని గ్రామాలు ఆయకట్టేతర ప్రాంతాలు.
- ఈ ప్రాంతాల మీదుగా ఎస్సారెస్పీ వరద కాలువలు పారుతున్నాయి.
- వీటిలో కనీసం 25మీటర్ల –50 మీటర్ల లోతులో నీరు ప్రవహిస్తోంది.
- ఎస్సారెస్పీ, వరదకాలువల్లోకి నీరు విడుదల చేస్తున్నా.. ఆయకట్టుకు నీరు అందడంలేదు.
- రైతులు రూ.లక్షలు వెచ్చించి వ్యవసాయ బావులు తవ్వుతూ, బోర్లు వేయించినా ఆశించిన నీళ్లు రావడంలేదు.
- వర్షాధారంతోపాటు కొద్దికొద్దిగా బావుల్లో లభించే నీటి ఆధారంగా వివిధ పంటలు వేసినా.. గింజదశకు చేరుకోగానే నీళ్లు అందక ఆ పంటలు ఎండిపోతున్నాయి.
- ఈ ప్రాంతాల్లో వ్యవసాయం గిట్టుబాటు కావడంలేదని భావించిన చాలామంది అన్నదాతలు ఉపాధి కోసం విదేశాలకు వెళ్లారు.

ఎత్తిపోతలే ఆధారం..

- తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు తర్వాత వరదకాలువ ఎడమవైపు 49 తూములు నిర్మించారు.
- వాటిద్వారా చెరువుల్లోకి నీటిని తరలించి, దాదాపు 40 వేల ఎకరాలకు సాగు నీరు అందిస్తున్నారు.
- వరద కాలువకు 2 కి.మీ. –3 కి.మీ పరిధిలోని రైతులు రూ.లక్షలు ఖర్చు చేసి వరద కాలువలో విద్యుత్ మోటార్లు బిగించి, పైపులైన్‌లు నిర్మించి పంటలు పండించుకుంటున్నారు.
- వరద కాలువలో నీరు ఉన్నా.. ఆయకట్టేతర మండలాలకు అందడంలేదు.
- దీంతో ఎత్తిపోతల ద్వారా నీరు అందించాలని రైతులు తరచూ ప్రజాప్రతినిధులపై ఒత్తిడి తెస్తున్నారు.
- రెండేళ్ల క్రితం సీఎం కేసీఆర్ మేడిపల్లి, కథలాపూర్ మండలాల రైతులు, ప్రజాప్రతినిధులతో సమావేశమై ఎత్తిపోతలపై చర్చించారు.
- ఎత్తిపోతల ద్వారా రిజర్వాయర్లు లేదా చెరువులకు తరలించి, అక్కడి నుంచి ఆయకట్టుకు నీరు తరలించేలా ప్రణాళిక సిద్ధం చేశారు.
- ఇలా నాలుగైదు గ్రామాల మధ్య నీరు ఉండేలా చూస్తే.. అవసరాల మేరకు వినియోగించుకోవచ్చని భావించారు.

నివేదికలు.. ప్రతిపాదనలకే పరిమితం..

- సీఎంతో సమావేశం తర్వాత అధికారులు, ప్రజాప్రతినిధులు కలిసి ఎత్తిపోతలపై నివేదికలు తయారు చేశారు. దాదాపు రూ.805.31 కోట్లు వెచ్చించి 54,215 ఎకరాలకు సాగు నీరు అందించాలని నిర్ణయించారు. తగిన నివేదికలను ప్రభుత్వానికి అందజేశారు.

దివంగత సీఎం వైఎస్సార్ హయాంలో వరదకాలువ..

- అధికంగా కురిసే వర్షాలతో ఎస్సారెస్పీ పూర్తిస్థాయిలో నీటితో నిండితే గోదావరి నదిలోకి వదులుతారు. ఈ జలాలు సముద్రంలో కలుస్తున్నాయి. అదనపు జలాలను సద్వినియోగం చేసుకోవాలనే లక్ష్యంతో దివంగత సీఎం వైఎస్సార్ వరద కాలు నిర్మించారు. ఇది జిల్లాలో సుమారు 58 కి.మీ. వరకు పారుతోంది. ఇబ్రహీంపట్నం మండలం ఎర్రాపూర్‌లో ప్రారంభమై.. మూడుబొమ్మల మేడిపల్లి, మెట్‌పల్లి మండలం రాజేశ్వర్‌రావుపేట, విట్టంపేట, జగ్గాసాగర్, రాంలచ్చక్కపేట, కథలాపూర్ మండలం కథలాపూర్, నాగుల లింగంపేట, తక్కళ్లపల్లి, దూలూరు, పెగ్గెర, మేడిపల్లి మండలం కల్వకోట, కాచారం, వెంకట్రావుపేట, మల్యాల మండలం రాంపూర్, మద్దుట్ల, నూకపల్లి, ముత్యంపేట, బల్వంతపూర్ గ్రామాల ద్వారా పారుతోంది. దీనికితోడు, ఎస్సారెస్పీ పునర్జీవ పథకం కింద కాళేశ్వరం నుంచి ఎస్సారెస్పీ వరకు వరద కాలువపై మూడు ఎత్తిపోతల పథకాలు నిర్మించారు. అందులో రెండు జిల్లాలోని మల్యాల, ఇబ్రహీంపట్నం మండలాల్లో ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఏడాది పొడవునా వరద కాలువ నీటితో నిండు కుండలా ఉంటోంది.

ప్రభుత్వం ఆమోదించాలి



ఆయకట్టేతర గ్రామాల రైతుల ఇబ్బందులు అన్నీఇన్నీ కావు. రూ.లక్షలు ఖర్చు పెడితేనే సాగునీరు చూసే పరిస్థితి లేదు. ఎత్తిపోతలకు త్వరగా ఆమోదం తెలిపి, నిధులు మంజూరు చేయాలి.

– కాటిపెల్లి శ్రీపాల్‌రెడ్డి, వెంకట్రావుపేట, మేడిపల్లి

సర్కారుకు నివేదించాం



వరద కాలువపై ఎత్తిపోతల నిర్మాణానికి రూ.805.31 కోట్లతో ప్రతిపాదనలు రూపొందించాం. ప్రభుత్వ ఆమోదానికి పంపించాం. అవి పరిశీలనలో ఉన్నాయి. సర్కారు ఆమోదించాల్సిఉంది.

– రమేశ్, డిప్యూటీ సీఈ, ఇరిగేషన్, జగిత్యాల

క్లుప్తంగా

ప్రమాదవశాత్తు బావిలో పడి వ్యక్తి మృతి


మహేశ్ మృతదేహం

జగిత్యాలక్రైం: రూరల్ మండలం కల్లెడ గ్రామానికి చెందిన పెద్దూరు మహేశ్ (35) ప్రమాదవశాత్తు వ్యవసాయ బావిలో పడి మృతిచెందాడు. కల్లెడకు చెందిన మహేశ్ ఆదివారం వ్యవసాయం పనులకు వెళ్లాడు. కూలీపని చేసి కాళ్లు కడుక్కునేందుకు బావి వద్దకు వెళ్లగా ప్రమాదవశాత్తు బావిలో జారి పడి మృతిచెందాడు. కూలిపనులకు వెళ్లిన మహేశ్ సాయంత్రమైన ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు స్థానికంగా గాలించారు. సోమవారం ఉదయం వ్యవసాయ బావిలో మృతదేహం లభ్యమైంది. మృతుడి తల్లి ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు రూరల్ ఎస్సై అనిల్ పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్రగాయాలు

మల్లాపూర్: మండలంలోని నడికుడలో ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో గజ్జి రవి(40)కి తీవ్రగాయాలైనట్లు ఎస్సై నవీన్ కుమార్ తెలిపారు. ఎస్సై కథనం ప్రకారం.. మండలంలోని రాఘవపేటకు చెందిన గజ్జి రవి బైక్‌పై మొగిలిపేటకు వెళ్తుండగా, అతివేగంగా వచ్చిన కారు ఢీ కొట్టడంతో బైక్‌పై నుంచి కింద పడి తీవ్రంగా గాయపడ్డాడు. కుటుంబసభ్యులు ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. బాధితుడి తమ్ముడు హరీశ్ ఫిర్యాదుతో కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ట్విట్టర్ వేదికగా కేటీఆర్ అభినందన

కొడిమ్యాల: చొప్పదండి ఎమ్మెల్యే సుంకె రవిశంకర్‌ను ఐటీశాఖ మంత్రి కేటీఆర్ ట్విట్టర్ వేదికగా సోమవారం అభినందించారు. నియోజకవర్గంలోని కొడిమ్యాల మండలం అప్పారావుపేటకు చెందిన బీజేపీ కార్యకర్త బుర్ర ప్రవీణ్ తండ్రి గంగరాజు కొద్దిరోజుల క్రితం అనారోగ్యంతో మృతిచెందగా ఎమ్మెల్యే రవిశంకర్ ఆదివారం ప్రవీణ్ ఇంటికి వెళ్లి రైతు బీమా చెక్కును అందించి కుటుంబ సభ్యులతో భోజనం చేశారు. దీనికి సంబంధించిన పత్రిక కథనాన్ని కేటీఆర్ ట్విట్టర్లో పోస్ట్‌చేశారు. దేశంలో రైతుబీమా అందిస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ రాష్ట్రమని ఇప్పటివరకు 40 లక్షల మంది రైతులకు రైతుబీమా అందించామని పేర్కొన్నారు. ఇతర రాజకీయ పార్టీ కార్యకర్తకు చెందిన కుటుంబ సభ్యుడు మృతిచెందినప్పటికీ స్వయంగా ఇంటికి వెళ్లి చెక్కును అందించడంపై ఎమ్మెల్యేను కేటీఆర్ అభినందించారు.

దాడికి పాల్పడిన ఇద్దరిపై కేసు

మల్లాపూర్ : మండలంలోని పాతదాంరాజుపల్లికి చెందిన రొండ్ల రాములు(40)పై ఆదివారం రాత్రి దాడికి పాల్పడిన ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై నవీన్‌కుమార్ తెలిపారు. ఎస్సై కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన రాములు ఇంట్లోనే కూల్‌డ్రింక్స్‌తో పాటు మద్యం విక్రయిస్తున్నాడు. ఆదివారం రాత్రి రాములు అన్న కుమారులు రొండ్ల రవి, రొండ్ల ప్రసాద్ రాములు ఇంటికి వెళ్లి మద్యం కావాలని గొడవకు దిగారు. ఈ క్రమంలో వీరిద్దరు ఖాళీ బీరుసీసాలతో రాములుపై దాడిచేయడంతో తలకు తీవ్రగాయలయ్యాయి. దీంతో కుటుంబసభ్యులు రాములును ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. బాధితుడు రాములు భార్య లలిత ఫిర్యాదుతో నిందితులు ఇద్దరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

అటకెక్కిన ఆవాల పరిశోధన స్థానం

- రెండేళ్లు గడిచినా అతీ, గతీ లేదు
- కేంద్రం ఏర్పాటులో ఐసీఏఆర్ తాత్సరం


జిల్లాలో సాగు చేసిన ఆవాల పంట


పొలాస వ్యవసాయ పరిశోధన స్థానం

జగిత్యాలఅగ్రికల్చర్: ఉత్తర తెలంగాణ వ్యవసాయ పరిశోధనలకు కేంద్రమైన జగిత్యాల రూరల్ మండలంలోని పొలాస పరిశోధన స్థానంలో ఆవాల పరిశోధన స్థానం ఏర్పాటు చేస్తామని రెండు, మూడేళ్లు గడుస్తున్నా ఇప్పటికి అతీ, గతీ లేకుండా పోయింది. ఆవాల పరిశోధన స్థానం మంజూరులో జాతీయ వ్యవసాయ పరిశోధన మండలి నుంచి కేంద్రప్రభుత్వం నిర్ణయం తీసుకున్నప్పటికీ ఎలాంటి పురోగతి లేదు. గతంలో వ్యవసాయశాఖ మంత్రి నిరంజన్‌రెడ్డి కేంద్ర ప్రభుత్వాన్ని కోరినప్పటికీ ఇప్పటికీ నిధులు కానీ, శాస్త్రవేత్తలను కానీ నియమించలేదు. దీంతో, ఆవాల పరిశోధన స్థానం అటకెక్కినట్లేనని రైతులు ముచ్చటించుకుంటున్నారు.

ఉత్తర తెలంగాణలోనే అధికం...

ఆవాల సాగు ఉత్తర తెలంగాణ జిల్లాలైన ఉమ్మడి కరీంనగర్, ఆదిలాబాద్, నిజామాబాద్ జిల్లాలోనే దాదాపు 50 వేల ఎకరాల్లో ఆవాల పంట సాగుచేస్తున్నారు. ఆయా ప్రాంతాల పొడి వాతావరణ పరిస్థితులు ఆవాల సాగుకు అనుకూలంగా ఉన్నాయి. దీనికి తోడు, సాగుకు అవసరమైన ఎర్రనేలలు ఆయా జిల్లాలో ఉండడం కూడా ఆవాల సాగు విస్తీర్ణం పెరగడానికి కారణమవుతుంది. దీనికి తోడు సాగునీటి వసతి ఉండడం, నాలుగైదు నీటి తడులు ఇస్తే సరిపోవడం, 80–90 రోజుల్లోనే పంట చేతికి వస్తుండడంతో రైతులు ఈ పంట సాగువైపు మొగ్గు చూపుతున్నారు. ఆవాల పంట ద్వారా తేనేటీగలు ఎక్కువగా ఉత్పత్తి అయ్యే అవకాశం ఉంది. రైతులు కొద్దిపాటి శిక్షణతో తేనెను ఉత్పత్తి చేసి మరింత ఆదాయం పొందే అవకాశం ఉందని శాస్త్రవేత్తలు భావిస్తున్నారు. మన జిల్లాలో మామిడి ఎక్కువగా ఉండడంతో, తేనెటీగలతో పరా పరాగ సంపర్కం జరిగి పిందె, కాయవృద్ధి చెందే అవకాశం ఉందని భావిస్తున్నారు.

ఇప్పటికే ప్రైవేట్ కంపెనీల హవా...

ఈ ప్రాంతాల్లో ప్రైవేట్ కంపెనీలు ఆవాల సాగును విస్తృతంగా చేపడుతున్నాయి. బై బ్యాక్ పద్ధతిలో కంపెనీలు విత్తనోత్పత్తిని చేపట్టి, ఇతర రాష్ట్రాలకు విత్తనాలు సరఫరా చేస్తున్నాయి. రైతులు విత్తనోత్పత్తిలో సాగుచేస్తే క్వింటాల్‌కు రూ.9వేల వరకు ధర అందిస్తున్నారు. సాధారణ ఆవాలకు క్వింటాల్‌కు రూ.7–8 వేల వరకు ధర చెల్లిస్తుండడంతో ఎక్కువ మంది రైతులు ఈ పంట సాగుకు ఆసక్తి చూపుతున్నారు. దీనికి తోడు, ఆవాల పంటకు అడవిపందులు, రామచిలుకలు, కోతుల బెడద లేకపోవడం, పంట ముందుగానే ఏ రేటు వస్తుందో రైతులకు తెలియడంతో ఎక్కువగా సాగుచేస్తున్నారు. మంచి పంటవస్తే ఎకరాకు 6–8 క్వింటాళ్ల వరకు దిగుబడి వస్తోంది. ఎకరాకు రూ.50వేల వరకు ఆదాయం వచ్చే అవకాశం ఉంది. వరి, మొక్కజొన్నకు ప్రత్యామ్నయంగా ఆవాల పంటను ప్రోత్సహించాలని రాష్ట్రప్రభుత్వం భావిస్తున్నప్పటికీ ఫలితం కనబడటం లేదు.

ఆశలు అడియాసలే..

కేంద్రప్రభుత్వం ఇక్కడ ఆవాల పరిశోధన స్థానం ఏర్పాటు చేస్తోందని తెలపడంతో ఇక్కడి రైతులు సంతోషించారు. కానీ రెండేళ్లు గడిచినా ఎలాంటి పురోగతి లేకపోవడంతో రైతుల ఆశలు అడియాసలయ్యాయి. ఆవాల పరిశోధన స్థానం వస్తే..అధిక దిగుబడులు వచ్చే కొత్త విత్తనాలు తయారు చేస్తారని, ఆవాల నూనె తీసే పరిశ్రమలు వస్తాయని ఆశపడ్డారు. రాష్ట్ర వ్యవసాయ పరిధిలోని పరిశోధన స్థానాలతో పోల్చితే, కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసే పరిశోధన స్థానాల్లో నిధులకు ఇబ్బందులుండవని, శాస్త్రవేత్తల సంఖ్య భారీగా పెరుగుతుందని, వివిధ రాష్ట్రాలతో ఎప్పటికప్పుడు చర్చించుకునే అవకాశం ఉంటుందని రైతులు భ్రమించారు. దీనికి తోడు, రైతుల తోటల్లో సైతం ప్రదర్శనలు, పరిశోధనలు చేసే అవకాశం ఉంటుందని కలగన్నారు. ఆవాలను నూనెగా, ఔషధ పరిశ్రమల్లో వాడుతుండడంతో మంచి డిమాండ్ ఉంది. దీంతో ఈ పంటను సాగుచేస్తే ఇక్కడి రైతులకు మేలు జరుగుతుందని ఆశపడ్డారు.

నివేదికలకే పరిమితం..

గత కొన్నేళ్లుగా ఉత్తర తెలంగాణ(పొలాస) పరిశోధన స్థానం పరిధిలో ఆవాలపంట సాగుచేసి, ఇక్కడి శాస్త్రవేత్తలు రాష్ట్ర వ్యవసాయ వర్శిటీతో పాటు జాతీయ వ్యవసాయ పరిశోధన మండలికి నివేదికలు పంపించారు. జాతీయ వ్యవసాయ పరిశోధన మండలి సంతృప్తి వ్యక్తం చేస్తూ, సానుకూలంగా నివేదికలు తయారుచేసి కేంద్ర ప్రభుత్వానికి పంపింది. కరోనాకు ముందు జరిగిన జాతీయ వ్యవసాయ పరిశోధన మండలిలో పాల్గొన్న వ్యవసాయశాఖ మంత్రి నిరంజన్‌రెడ్డి తెలంగాణలోని పొలాసలో ఆవాల పరిశోధన స్థానం ఏర్పాటు చేయాలని కోరారు.

రైతులకు మేలు



పొలాస వ్యవసాయ పరిశోధన స్థానం పరిధిలో ఎక్కువగా ఆవాల పంటసాగుచేశారు. ఆ వాల పరిశోధన స్థానంతో రైతులకు ఎంతో మే లు కలుగుతుంది. గతంలోనే రాష్ట్ర అగ్రికల్చర్ యూనివర్సిటీ ద్వారా ఐసీఏఆర్‌కు నివేదిక అందించాం. జాతీయ వ్యవసాయ పరిశోధన మండలి సైతం సంసిద్ధత వ్యక్తం చేసినట్లు తెలిసింది. అవసరమైతే మరోసారి నివేదికలు పంపించేందుకు సిద్ధంగా ఉన్నాం.

– డాక్టర్ శ్రీనివాస్, వ్యవసాయ పరిశోధన స్థానం డైరెక్టర్, పొలాస

సూరమ్మ ప్రాజెక్టు పనులు ప్రారంభించాలి


వినతిపత్రం ఇస్తున్న ప్రజాప్రతినిధులు

కథలాపూర్: మండలంలోని రైతులకు ప్రధానమైన సూరమ్మ ప్రాజెక్టు పనులు త్వరగా ప్రారంభించాలని ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు వినోద్‌కుమార్‌కు బీఆర్ఎస్ నాయకులు సోమవారం వినతిపత్రం ఇచ్చారు. మార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్ లోక బాపురెడ్డి ఆధ్వర్యంలో బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు హైదరాబాద్ వెళ్లి వినోద్‌కుమార్‌తో అభివృద్ధి పనులపై చర్చించారు. సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్తామని వినోద్‌కుమార్ హామీ ఇచ్చినట్లు ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో రైతుబంధు సమితి జిల్లా సభ్యుడు చీటి విద్యాసాగర్‌రావు, ఎంపీపీ జవ్వాజి రేవతి, జెడ్పీటీసీ నాగం భూమయ్య, ఎంపీటీసీలు, సర్పంచులు బాలు, కిరణ్‌రావు, ఆంజనేయులు, గంగరాజం, రమేశ్, గోపు శ్రీనివాస్, బద్దం మహేందర్, గడ్డం శేఖర్‌రెడ్డి, ముస్కు శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

ధర్మారం(ధర్మపురి): మండలంలోని కటికెనపల్లి గ్రామశివారు కొచ్చగుట్ట వద్ద సోమవా రం గుర్తుతెలియని మృతదేహం లభ్యమైన ట్లు ఎస్సై శ్రీనివాస్ తెలిపారు. గొర్రెల కాపరి సమాచారం మేరకు ఎస్సై ఆధ్వర్యంలో పో లీసులు సంఘటన స్థలానికి చేరుకుని ప రిశీలించగా మృతదేహం పూర్తిగా కుళ్లిపోయి ఉందని, కరీంనగర్‌లోని మార్చురికి తరలించినట్లు పేర్కొన్నారు. కాగా గుర్తు తెలియని మృతదేహంపై చొప్పదండికి చెందిన వ్యక్తిగా అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

నకిలీ వస్త్రాల దిగుమతిని అరికట్టాలి

- పండుగ వేల టెస్కో ప్రకటనలు ఏవి?
- కార్పొరేట్ సంస్థలకు కొమ్ముకాస్తున్న సర్కారు
- బీసీ రాజ్యాధికార సమితి కన్వీనర్ దాసు సురేశ్


అభివాదం చేస్తున్న బీసీ రాజ్యాధికార సమితి నేతలు

సిరిసిల్లటౌన్: ఇతర రాష్ట్రాల నుంచి దిగుమతి అవుతున్న నకిలీ వస్త్రాల ఆర్డర్లను నిలిపివేయాలని బీసీ రాజ్యాధికార సమితి అధ్యక్షుడు దాసు సురేశ్ డిమాండ్ చేశారు. సోమవారం సిరిసిల్ల ప్రెస్‌క్లబ్‌లో సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో పా ల్గొని మాట్లాడారు. పండుగల వేల రాష్ట్రంలో చేనేత, మరమగ్గాల కార్మికులకు పని కల్పించేందుకు టెస్కో ఆర్డర్ల ప్రకటన విడుదల చేయలేదని, రాష్ట్ర ప్రభుత్వం చేనేత వస్త్రోత్పత్తిలో కార్పొరేట్లకు కొ మ్ముకాస్తోందన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం తీరుతో నే చేనేత, నేత కార్మికుల ఆత్మహత్యలు కొనసాగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో ల్యాండ్, లిక్కర్ మాఫియాలను మించిన రూ.50 వేల కోట్ల నకిలీ వస్త్రాల మాఫియా కొనసాగుతోందని ఆరోపించారు. బతుకమ్మ చీరల తయారికే సిరిసిల్ల నేతన్నలను పరిమితం చేసి విలువైన పట్టుచీరల తయారీని ఆంధ్ర, తమిళనాడు నుంచి దిగుమతి చేయడంలో ప్రభుత్వ ఆంతర్యం ఏమిటని ప్రశ్నించారు. సిరిసిల్ల పవర్‌లూమ్స్‌ను అప్‌గ్రేడ్ చేయకుండా వస్త్రాల మాఫియాకు వత్తాసు పలుకుతూ..కోట్లాది రూపాయలు దోచి పెడుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. వస్త్రాల మాఫియా, వారికి సహకరిస్తున్న అధికారులు, మంత్రులపై సీఎం కేసీఆర్ చర్య తీసుకోవాలని డిమాండ్ చేశారు. చేనేత కార్మికుల ఇన్సూరెన్స్ వెంటనే అమలుచే యా లని కోరారు. కార్యక్రమంలో సిరిసిల్ల మున్సిపల్ మాజీ చైర్మన్ ఆడెపు రవీందర్, సమితి నాయకులు రిక్కుమల్ల మనోజ్‌కుమార్, కుమార్‌గాడ్గే, గోనె ఎల్లప్ప, కొండ ప్రతాప్, శివ తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ యువకుడు మృతి


రమేశ్(ఫైల్)

కాల్వశ్రీరాంపూర్(పెద్దపల్లి): మండల కేంద్రానికి చెందిన రాదారపు రమేశ్(25) చికిత్స పొందుతూ మృతిచెందా డు. పోలీసుల వివరాలు.. మద్యానికి బానిసైన ర మేశ్ ను ఆదివారం రాత్రి తల్లిదండ్రులు మందలించారు. దీంతో మనస్తాపానికి గురై మ ద్యం మత్తులో పురుగుల మందు తాగాడు. వె ంటనే కాల్వశ్రీరాంపూర్ ప్రభుత్వ ఆసుపత్రి లో ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వై ద్యం కోసం కరీంనగర్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందాడు. తండ్రి గట్టుస్వామి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాజవర్ధన్ తెలిపారు.

అదుపు తప్పిన ఆర్టీసీ బస్సు

- స్టీరింగ్ స్టక్ అయి చెట్టుకు ఢీకొట్టిన వైనం
- 18 మంది ప్రయాణికులకు గాయాలు
- ప్రమాద సమయంలో బస్సులో 41 మంది
- సహాయక చర్యల్లో మంథని ఎమ్మెల్యే శ్రీధర్‌బాబు
- క్షతగాత్రులను ఆస్పత్రులకు తరలించిన మున్సిపల్ చైర్‌పర్సన్ శైలజ


ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులు



గాయపడిన వారికి అందిస్తున్న వైద్యం


ప్రమాదానికి గురైన బస్సు


సహాయక చర్యలో ఎమ్మెల్యే శ్రీధర్‌బాబు

మంథని: మంథని–కాటారం ప్రధాన రహదారిపై.. అడవిసోమన్‌పల్లి–నాగేపల్లి సమీపంలో ఆర్టీసీ బస్సు అదుపుతప్పి చెట్టుకు ఢీకొట్టిన సంఘటనలో బస్సులో ఉన్న 18 మంది ప్రయాణికులు గాయపడ్డారు. మరో పదిమందికి స్వల్ప గాయాలయ్యాయి. ఎనిమిది మందికి తల, ఇతర శరీర భాగాలకు గాయాలు కావడంతో వారిని కరీంనగర్ ఆస్పత్రికి తరలించారు. సంఘటనకు సంబంధించిన వివరాలు.. మంథని ఆర్టీసీ డిపోకు చెందిన బస్సు మంథని నుంచి జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని తాడిచర్లకు 41 మంది ప్రయాణికులతో బయల్దేరింది. నాగేపల్లి సమీపంలోకి రాగానే బస్సు స్టీరింగ్ స్టక్ కావడంతో అదుపు తప్పి రోడ్డుకు అడ్డంగా తిరిగింది. డ్రైవర్ గోపాల్ ప్రమాదాన్ని గుర్తించి బ్రేక్‌లు వేయగా.. పక్కనే ఉన్న చెట్టుకు ఢీ కొట్టింది. ఈ ఘటనలో గాయపడిన వారిని మంథని సామాజిక వైద్యశాలకు తరలించారు. వైద్యులు చికిత్స అందించారు. గాయపడిన వారంతా జయశంకర్‌భూపాలపల్లి జిల్లా, ఎస్టీపీసీకి చెందినవారు. మల్లారానికి చెందిన రావుల స్వరూప, గాదంపల్లికి చెందిన నల్లాల శారద, చిన్నతూండ్లకు చెందిన సరోజన తలకు బలమైన గాయాలు అయ్యాయి. మల్లారానికి చెందిన దేనవేన అశ్విని పళ్లు విరిగాయి. గాదంపల్లికి చెందిన తిరుపతి ప్రియాంక, ఆమె తల్లి విజయ, రెండు నెలల చిన్నారి స్వల్ప గాయాలతో బయటపడింది. క్షతగాత్రులు 18 మందిని సామాజిక ఆసుపత్రికి తీసుకురాగా ఆస్పత్రి ఇన్‌చార్జి శ్రీనివాస్‌రెడ్డి మాతా శిశు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రంతోపాటు ప్రైవేటు ఆస్పత్రుల వైద్యులను పిలిపించి వైద్య సేవలు అందించారు.

సహాయక చర్యల్లో ఎమ్మెల్యే శ్రీధర్‌బాబు

కాటారం పర్యటనకు వెళ్లి మంథని వస్తున్న ఎమ్మెల్యే శ్రీధర్‌బాబుకు మార్గంమధ్యలో ప్రమాదం కనిపించడంతో అక్కడే ఆగి.. క్షతగాత్రుల సహాయక చర్యల్లో పాల్గొన్నారు. బాధితులను తన వాహనాలతోపాటు తన పార్టీ నాయకుల వాహనాల్లో ఆస్పత్రులకు తరలించారు. మిగిలిన ప్రయాణికులను మరో బస్సును రప్పించి వారివారి గ్రామాలకు పంపించారు. గాయాలతో వచ్చిన వారికి మంథని మున్సిపల్ చైర్‌పర్సన్ పుట్ట శైలజ దగ్గరుండి వైద్య పరీక్షలు చేయించారు. ఎనిమిది మందిని కరీంనగర్‌లోని ఆస్పత్రులకు పంపించారు. మంథని ఎస్సై వెంకటేశ్వర్లు సంఘటనా స్థలానికి చేరుకుని పెద్ద ఎత్తున నిలిచిపోయిన ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. రెండో ఎస్సై రాణివర్మ సామాజిక వైద్యశాలలో సేవలందించారు.

ఇద్దరు పిల్లలతో వివాహిత ఆత్మహత్యాయత్నం

యైటింక్లయిన్‌కాలనీ(రామగుండం): మంచిర్యాల జిల్లా నస్పూర్‌కు చెందిన ఓ వివాహిత (30)తన ఇద్దరు పిల్లలతో సోమవారం గోదావరినదిలో దూకి ఆత్మహత్య చేసుకునేందుకు యత్నించింది. గోదావరిఖని టూటౌన్ పోలీసులు, స్థానికులు, రివర్ పోలీసుల వివరాలు.. కుటుంబ కలహాలతో మనస్తాపానికి గురైన వివాహిత తన ఇద్దరు చిన్నారులను తీసుకొని గోదావరి బ్రిడ్జి వద్దకు వచ్చి నదిలో దూకింది. అటు నుంచి వస్తున్న వాహనదారుడు గమనించి వారిని కాపాడేందుకు తను కూడా నదిలో దూకాడు. అక్కడే విధులు నిర్వహిస్తున్న రివర్ పోలీసులు, జా లర్లు తాడు, పడవ సాయంతో వారిని ఒడ్డుకు చేర్చారు. వెంటనే 108 అంబులెన్స్‌లో గో దావరిఖని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించారు. కౌన్సెలింగ్ చేసి కుటుంబ సభ్యులకు అప్పగించారు. కాగా ఎవరికీ ఎలాంటి ప్రాణపాయం లేదని తెలిపారు. వెంటనే స్పందించి కాపాడిన రివర్ పోలీస్ సదానందం, హోంగార్డు శ్రీధర్, వాహనదారుడిని టూటౌన్ సీఐ వేణుగోపాల్ అభినందించారు.

ఉరేసుకొని వృద్ధుడి ఆత్మహత్య

ధర్మారం(ధర్మపురి): మండల కేంద్రానికి చెందిన బోయిని గంగారాం (65) అనారోగ్యంతో జీవితంపై విరక్తి చెంది సోమవారం తెల్లవారుజామున ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై శ్రీనివాస్ తెలిపారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న గంగారాం మందులు వాడినా నయం కాలేదు. దీంతో జీవితంపై విరక్తితో ఇంట్లో ఎవరూలేని సమయంలో ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి కుమారుడు నరేష్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

కేజీవీల్స్ ట్రాక్టర్లకు జరిమానా


పట్టుకున్న కేజీవీల్ ట్రాక్టర్

కోరుట్లరూరల్: కోరుట్ల పట్టణంతో పాటు మల్లాపూర్ మండల శివారులోని తారు రోడ్డుపై నడిపిస్తున్న కేజీవీల్స్ ట్రాక్టర్‌ను కోరుట్ల ఎంవీఐ రంజిత్ సోమవారం పట్టుకొని జరిమానా విధించారు. ఒక్కో ట్రాక్టర్‌కు రూ.5వేల చొప్పున జరిమానా విధించినట్లు ఆయన పేర్కొన్నారు. రోడ్లపై కేజీవీల్స్ ట్రాక్టర్లు నడిపించడం నేరమని దీంతో రోడ్లు దెబ్బతింటున్నాయని, పొలం పనులు పూర్తయిన తర్వాతే టైర్లతో రోడ్డెక్కాలని ఎంవీఐ పేర్కొన్నారు.

కుక్కల దాడిలో 8 గొర్రెలు మృతి


మృతిచెందిన గొర్రెలు

సారంగాపూర్: బీర్‌పూర్ మండలం కొల్వాయి గ్రామంలో సోమవారం కుక్కలు దాడిచేశాయి. ఈ దాడిలో ఎనిమిది గొర్రెలు మృతిచెందాయి. మరో 10 గొర్రెలకు తీవ్ర గాయాలయ్యాయి. వివరాల్లోకి వెళితే.. కొల్వాయి గ్రామానికి చెందిన సంగ గంగన్నకు చెందిన గొర్రెల మందను ఇంటి సమీపంలో చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేసి గొర్రెల మంద ఏర్పాటుచేశారు. కుక్కలు ప్లాస్టిక్ వలను తెంచి మందపై దాడి చేయడంతో అక్కడికక్కడే 8 గొర్రెలు మృతిచెందాయి. మరో పది గొర్రెలు తీవ్ర గాయాలపాలయ్యాయి. ప్రభుత్వం పరిహారం అందించాలని గంగన్న, ఆయన భార్య లక్ష్మి వేడుకుంటున్నారు.

రాగివైరు చోరీ

సుల్తానాబాద్‌రూరల్(పెద్దపల్లి): సుల్తానాబాద్‌లోని రైస్‌మిల్ అసోసియేషన్ సమీపంలో రాజీవ్ రహదారిని ఆనుకొని ఉన్న వైండింగ్ షాపులో ఆదివారం రాత్రి చోరీ జరిగింది. షాపులోని సుమారు ఒక క్వింటాల్ రాగి తీగను ఎత్తుకెళ్లినట్లు బాధితుడు సంపత్ తెలిపాడు. దీని విలువ దాదాపు రూ.ఒక లక్ష వరకు ఉంటుందని పేర్కొన్నాడు. ఈ ఘటనపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్ఐ ఉపేందర్‌రావు తెలిపారు.

గుడికోటలో సంక్రాంతి పాట చిత్రీకరణ


కళాకారులను అభినందిస్తున్న మున్సిపల్ చైర్మన్

రాయికల్: పట్టణంలోని చెన్నకేశవనాథ ఆలయంలో సోమవారం జగిత్యాలకు చెందిన ఎస్వీ మల్లికతేజ దర్శకత్వంలో సంక్రాంతి పాట చిత్రీకరణ చేపట్టారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ మోర హన్మండ్లు, పర్యవేక్షకులు బొమ్మకంటి నాగరాజు, కౌన్సిలర్ మహేందర్, ఆలయ కమిటీ నిర్వాహకులు తుమ్మల సదాశివరెడ్డి, సాంకేతిక నిపుణులు నాగరాజు, మనోజ్, మౌనిక, మహేశ్ పాల్గొన్నారు.

ఆయన నేత్రాలు సజీవం


తిరుమల్‌రెడ్డి(ఫైల్)

యైటింక్లయిన్‌కాలనీ(రామగుండం): రామగుండం కార్పొరేషన్ పోతనకాలనీలో నివాసం ఉంటూ సింగరేణి ఓసీపీ–3 లో విధులు నిర్వహిస్తున్న తుమ్మల తిరుమల్‌రెడ్డి(42) సోమవారం గుండెపోటుతో మృతి చెందాడు. ఆయన నేత్రాలను దానం చేసేందుకు కుటుంబ సభ్యులు ముందుకు వచ్చారు. సదాశయ ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి లింగమూర్తి ఆధ్వర్యంలో టెక్నీషియన్ ఆరిఫ్‌తో నేత్రాలు సేకరించి హైదరాబాద్‌లోని వాసన్ ఐ బ్యాంకుకు తరలించారు. సమాజహితం కోసం ఇద్దరు అంధులకు చూపును ప్రసాదించేందుకు మృతుడి నేత్రాలను దానం చేసేందుకు ముందుకు వచ్చిన కుటుంబ సభ్యులు తిరుమల్‌రెడ్డి భార్య రమాదేవి, కూతుళ్లు దీక్షిత్‌రెడ్డి, తనిష్కరెడ్డి, సోదరుడు సురేందర్‌రెడ్డిలను ఫౌండేషన్ అధ్యక్షుడు శ్రావణ్‌కుమార్, మారెల్లి రాజిరెడ్డి, రాంరెడ్డి, రమేశ్‌రెడ్డి, సురేశ్‌రెడ్డి, లయన్స్ క్లబ్ అధ్యక్షుడు రాజేందర్ తదితరులు అభినందించారు.